క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలోని 4వ వార్డులో రూ.20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో రూ.25 కోట్లతో నిర్మించే నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెల రోజులపాటు విద్యార్థులకు లకు అందించే మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్, దోమ ఆనంద్,గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, చల్లగుళ్ల నర్సింహారావు, దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వడ దెబ్బపై అవగాహన

మధిర: వడదెబ్బపై ప్రజల్లో అవగాహన కల్పించాలని దెందుకూరు పీహెచ్‌సీ వైద్యులు బి.సాయి పృధ్వీరాజ్‌నాయక్ అన్నారు. గురువారం పీహెచ్‌సీ ప్రాంగణంలో ఆశాడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ పారా మెడికల్ సిబ్బంది గ్రామాల్లో, పట్టణంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు వడదెబ్బ – ఎండాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎండాకాలం అతి సారవ్యాధి ప్రబలకుండా ప్రతి సెంటర్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ పరిధిలో పని చేస్తున్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మక్క - సారక్క గద్దెలకు శంకుస్థాపన

బోనకల్: ముష్టికుంట్ల గ్రామంలో గురువారం సమ్మక్క – సారక్క గద్దెలకు శంకుస్థాపన చేశారు. వెంకయ్య గురుస్వామిచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ దైవకార్య నిర్వాహణలో భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు. అత్యంత పవిత్రమైన సమ్మక్క – సారక్క గద్దెలు వారి చరిత్రకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో దైవజ్ఞురాలు బోయినపల్లి ఉమాదేవి, గ్రామపెద్దలు బందం నాగేశ్వరావు, దొడ్డా మురళి,బందం నాగేశ్వరావు, బందం ఉస్సేన్, పిల్లలమర్రి నాగేశ్వరావు, లాల్ బహుదూర్‌శాస్త్రీ,కొప్పుల తిరుపతిరావు తదితరులు, పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాల రద్దుపై నిరసన



ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కారేపల్లి: 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గిరిజనులకు మంజూరైన ట్రైకార్ రుణాలను రద్దు చేయటాన్ని నిరసిస్తూ.. మండలంలోని గిరిజనులు గిరిజన సంఘం ఆధ్వర్యంలో కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ముందు గురువారం నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు అజ్మీర శోభన్ నాయక్, సంఘం నాయకుడు కిషన్‌నాయక్, శ్రీనునాయక్, శ్రీనునాయక్, పవన్, లక్ష్మణ్, మంచా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలను ఆపలేరు

ముదిగొండ: అక్రమ అరెస్టు చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పానుకుల సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నిర్బంధాలతో విద్యార్థుల ఉద్యమాన్ని ఆపలేరన్నారు. హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీ చార్జ్ చేయడం హేయమైన చర్య అని అన్నారు.

పేదరికం అడ్డు కాదు

బోనకల్: సమాజానికి సేవ చేయడానికి పేదరికం అడ్డుకాదని తలంపు ఉంటే అది సాధ్యమని ఆరోగ్య భారతీ సమన్వయకర్త డాక్టర్ మరళీకృష్ణ అన్నారు. గురువారం కలకోట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాగునీటి కోసం ఆర్వోప్లాంట్‌ను ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త కర్నాటి హనుమంతరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సేవాసమితి ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్ఎస్ఎస్ చీఫ్ కాటేపల్లి లక్ష్మీనారాయణ, సంఘ స్వయం సేవక్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ముదిగొండ: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ముదిగొండ మండలం సువర్ణాపురంలో గురువారం పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దాడులను అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సువర్ణాపురంలో చర్చి నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు మండల పాస్టర్ల ఫెలోషిప్ చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పాస్టర్ల ఫెలోషిప్ ప్రతినిధులు, పాస్టర్లు ఆంథోని, దినకరన్, రాంబాబు, దీవీదు, అబ్రహం, యస్తేరు, జాన్‌సుధాకర్, అజయ్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం నిరుపయోగం



అపరిశుభ్రంగా ఉన్న ఓపెన్ జిమ్



నిరుపయోగంగా ఉన్న టెన్నిస్ కోర్టు



కోచ్ లేకుండానే ఆడుకుంటున్న యువకులు

వైరా: క్రీడాలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి ఉపయోగపడతాయని నానుడి ఉన్నది. కానీ ఇక్కడి ఇండోర్ స్టేడియం మాత్రం నిరుపయోగంగా తయారైంది. గత 15 ఏళ్ల క్రితం నిర్మించిన వినియోగంలోకి రాకపోగా ప్రభుత్వాలు మారి గత రెండేళ్ల క్రితం ఇండోర్ స్టేడియాన్ని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నిధులతో సుమారు 90 లక్షల వరకు వెచ్చించారు. నిర్మాణం చేపట్టారు కానీ ఇక్కడ కోచ్ లేకపోవడంతో ఇండోర్ స్టేడియం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం వేళల్లో వైరా పట్టణంలో ఉన్న ప్రముఖులు, యువకులు వ్యాయమం కోసం ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్నారు.

ఏమేం ఉన్నాయంటే..

ఇండోర్ స్టేడియంలో మొత్తం 3 ఉడెన్ కోర్టులు ఏర్పాటు చేశారు. ఉదయం, రాత్రి వేళల్లో సైతం ఆటలు ఆడుకునేలా విద్యుత్ వెలుగులు, డ్రెస్సింగ్ రూమ్, వాష్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ఇండోర్ స్టేడియాన్ని అనుకోని రూ. 1.20 కోట్ల అంచనా వ్యయంతో టెన్నిస్ కోర్టును కూడా ఏర్పాటు చేశారు. కానీ ఒక్క రోజు కూడా ఇక్కడ ఎలాంటి క్రీడలు నడవలేదు. ఈ ప్రాంగణానికి కూడా చుట్టూ పెన్సింగ్ వేసి విద్యుత్ వెలుగులు అందించారు. ఈ కోర్టు కూడా నిరుపయోగంగానే మారింది.

పర్యవేక్షణ లేదు..

పట్టణంలోని యువతి, యువకులు, విద్యార్థులకు క్రీడాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియంలో ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుతుంది. ఇండోర్ స్టేడియాన్ని అనుకోని ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఓపెన్ జిమ్‌కు సాయంత్రం వేళల్లో పట్టణంలోని మహిళలు ఎంతో ఉత్సాహంగా వ్యాయమాలు చేసేందుకు వస్తున్నారు.

గతంలో ఇలా..

గత రెండేళ్ల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక చొరవతో ప్రతి వారం పట్టణంలోని గురుకుల పాఠశాల విద్యార్థినీలు, పట్టణంలోని పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకించి స్పోర్ట్ పిరియడ్ ఏర్పాటు చేయించి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక కోచ్‌ను నియమించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కానీ ఇప్పుడు అటువంటి ఆటలు ఏమి ఇక్కడి ఇండోర్ స్టేడియంలో నిర్వహించడం లేదు.

శిబిరాలు ఉంటాయా..?

ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయిన తర్వాత రెండేళ్లలో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించేవారు. కానీ ఇప్పుడు కనీసం ఇక్కడ క్రీడా పోటీలు వేసవి శిక్షణ శిబిరాలు వంటివి కూడా నిర్వహించేందుకు అవకాశం లేదు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వలన సుమారు రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇక్కడి ఇండోర్ స్టేడియం నిరుపయోగంగా మారింది. పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. కనీసం మున్సిపాలిటీ అధికారులు కూడా ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో అపరిశుభ్ర వాతావరణంలోనే దర్శనమిస్తుంది. పందులు, కోతులు వంటివి ఈ ప్రాంగణంలో సంచరిస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కేంద్ర బిందువుగా మారింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ వేసవిలో అయిన ఇండోర్ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకోచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

షటిల్ అంటే ఇష్టం..



ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడటం అంటే నాకు ఎంతో ఇష్టం. షటిల్‌లో మంచి గుర్తింపు పొందాలని ఉంది. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో ఇండోర్ స్టేడియానికి వచ్చి ఆటలు ఆడుకుంటున్నాం. కానీ నేర్పించే వాళ్లు లేరు.

– ఉమర్ ఫారుఖ్, విద్యార్థి, వైరా

కోచ్‌ను కేటాయించాలి..



ఇండోర్ స్టేడియంలో కోచ్ లేకపోవడంతో షటిల్‌లో మెళుకువలు నేర్చుకోలేకపోతున్నాను. ఇండోర్ స్టేడియానికి ప్రత్యేకించి కోచ్‌ను ఏర్పాటు చేస్తే మాకు సౌకర్యవంతంగా ఉంటుంది.

– నరేష్, విద్యార్థి, వైరా

వేసవిలో ప్రతి రోజు వస్తుంటాం..



ఇండోర్ స్టేడియానికి ప్రతి రోజు వేసవి సెలవుల్లో వచ్చి ఆడుకుంటాను కానీ మాకు ఆసక్తి ఉన్నప్పటికీ ఎలా ఆడలో తెలియడం లేదు. ఇండోర్ స్టేడియం షటిల్ ఆడేందుకు అనుకూలంగా ఉంది.

– చరణ్ సింగ్, విద్యార్థి, వైరా

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కల్లూరు: శివాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



చింతకాని: లచ్చగూడెంలో ప్రారంభిస్తున్న మధిర ఆత్మ కమిటీ డైరెక్టర్ గోవిందరావు

కల్లూరు/కల్లూరురూరల్/పెనుబల్లి/చింతకాని: కల్లూరు పట్టణంలోని శివాలయంలో ఐకేపీ ఆధ్వర్యంలో, కల్లూరురూరల్ మండలంలోని నారాయణపురం, పేరువంచ ఎర్రబోయినపల్లి గ్రామాల్లో, పెనుబల్లిలోని మర్లకుంటలో, చింతకానిలోని లచ్చగూడెం, బస్వాపురం, నేరడ గ్రామల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి, మధిర ఆత్మ కమిటీ డైరెక్టర్ గోవిందరావు, కొర్లగూడెం సొసైటీ చైర్మన్ కీసర వెంకటేశ్వరరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎం.రూప, సొసైటీ డైరెక్టర్ జె.గోపాల్ రావు, కీసన మధు, అంకిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కీసన మోహన్‌రెడ్డి, భాగం ప్రభాకర్, ఏనుగు సత్యంబాబు, అర్జున్‌రావు, బత్తుల రాము, కార్యక్రమంలో ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్ సాంబశివుడు, ఎండీఓ చంద్రశేఖర్, ఏఓ రూప, ఏపీఎం రాంబాబు, ఏఎంసీ చైర్మన్ నీరజ, ఆలయ చైర్మన్ వెంకటేష్, వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, రామరాజు, తహసీల్దార్ ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఏఓ ఏపీఎస్ రాజు, గోపి, రమేష్, మాధవరావు, వెంకటేశ్వర్లు, మల్లయ్య, నాగయ్య, షాజహాన్, వెంకటేశ్వర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఫొటో పెట్టాల్సిందే..

ఎర్రుపాలెం: రేషన్ షాపుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలను డీలర్లు వధిగా పెట్టాలని బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని రేషన్ దుకాణాలకు వెళ్లి మోదీ చిత్రపటాలను అందించారు. రేషన్ జారీలో కేంద్ర ప్రభుత్వం వాటా అధికంగా ఉన్నందున మన దేశ ప్రధాని ఫొటో పెట్టడం సముచితమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కందుకూరు కృష్ణయ్య, చల్లా సురేష్, మోహన్‌రావు, ప్రేమ్‌కుమార్, నవీన్, వేణు, లింగయ్య, దయాకర్, రూబేను తదితరులు ఉన్నారు.

మెనూ విధిగా పాటించాలి



కేజీబీవీలో మాట్లాడుతున్న జీసీడీఓ తులసి

ఎర్రుపాలెం: విద్యార్థుల భోజనంలో నిర్దేశించిన మెనూ విధిగా పాటించాలని కేజీబీవీ జీసీడీఓ తులసి సూచించారు. గురువారం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. మెనూ అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతలో తగిన ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని, మెనూ విధిగా పాటించాలని హెచ్చరించారు. పాఠశాలలో వసతుల కల్పనకు గానూ చేపట్టాల్సిన మరమ్మతులు ఎందుకు పెండింగ్ ఉన్నాయని సూపరిండెంట్ సరితను ప్రశ్నించారు. బాలికలు చదువుల్లో బాగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మధిర: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మధిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి పడకంటి మురళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం సీపీఎం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు మందా సైదులు, పడకంటి మురళి, పాపినేని రామ నరసయ్య, మందడపు ఉపేంద్ర, వడ్రానపు మధు, గౌరరాజు ధనలక్ష్మి, పుచ్చకాయల కిషోర్, శ్రీరాములు ,దొంతి వీరాచారి, అంకె శివయ్య, కాలసాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ రోజారాణి

కొణిజర్ల: రాజీవ్ యువ వికాసం పథకం గురించి గ్రామాల్లో నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ రోజారాణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజీవ్ యువ వికాసం పథకంపై గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 14 తేదీ వరకు ఆన్‌లైన్ చేసి, ఆ పత్రాలతో పాటు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు జతపరచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజేశ్వరి, ఏపీఓ అమ్మాజాన్, ఈసీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్‌యువ వికాసం పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చిన్ననాగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ముస్లిం, క్రైస్తవ మతపెద్దలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ మైసా శ్రీనివాసరావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పురందర్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ రేణుక ఎల్లమ్మ, పరమేశ్వర, లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి, సత్తెమ్మ, గంగమ్మ, మైసమ్మ తల్లుల విగ్రహాలను పండితుల వేదోచ్ఛరణల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ నిర్మాణ కమిటీ ధర్మకర్త డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రోజారమణి పర్యవేక్షణలో కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై మధుబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటరమణ, నిర్మల, వేదపండితులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వేసవి దృష్ట్యా ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు కల్లూరుబస్టాండ్ అడ్డా ఆటో యూనియన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి గురువారం ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. వడదెబ్బ బారినపడకుండా ఉండేందుకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎంఎఫ్ఎస్.సాహితి, ఎస్ఎం ఆనందం, వీబీఓ కిన్నెర ఆనంద్, ఆటో యూనియన్ బాధ్యులు అంబోజు శ్రీనివాసరావు, గుంషావలీ, రవి పాల్గొన్నారు.

సన్మానం..

తల్లాడ: తల్లాడకు చెందిన గోపిశెట్టి వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె గోపిశెట్టి సుస్మితను బీజేపీ నాయకులు గురువారం సన్మానించారు. తల్లాడకు చెందిన సుస్మిత గ్రూప్–1లో ఉద్యోగం సాధించటం గర్వంగా ఉందని బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణారావు, కిరణ్, కృష్ణ, నరేష్, బసవయ్య, రామక్రిష్ణ, చల్లారాము, కోటి పాల్గొన్నారు.

ధాన్యంపై పట్టాలు కప్పిన రైతులు

తల్లాడ: మండలంలో గురువారం సాయంత్రం మబ్బులు పట్టి వర్షం జల్లు పడటంతో రైతులు ధాన్యం తడవకుండా పట్టాలు కప్పారు. రబీ సీజన్‌లవరి ధాన్యం కైలు చేసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా రైతులు ఉరుకులు, పరుగులతో పట్టాలు కప్పారు. మిర్చి రైతులు కూడా కల్లాల్లో ఆరబెట్టి ఉంచిన కాయలు తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి కాపాడుకున్నారు.

యాజమాన్య పద్ధతులను పాటించాలి

చింతకాని: పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పద్ధతులను పాటించాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయ్ చంద్ర తెలిపారు. మండలంలోని కొదుమూరు, రాఘవాపురం గ్రామాల్లో జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా అందజేసిన ఎంటీయూ 1010 రకం వరి విత్తనాలతో సాగుచేసిన వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. అలాగే ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించి పంటలకు ఎన్ని తడులు అవసరమవుతాయని రైతులను అడిగి తెలుసుకుని వారబందీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తరణాధికారి అయేషా ఫాతిమా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్

సత్తుపల్లిటౌన్: గత రెండు నెలలుగా సత్తుపల్లి విశ్వశాంతి విద్యార్థులు చాంపియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధన కోసం డూసంథింగ్ గ్రేట్ పేరిట కృషి చేస్తున్నారు. ఈ నెల 2, 3వ తేదీల్లో తుది పరీక్ష జరిగింది. మొత్తం 110 మంది విద్యార్థులు 110 యాక్టివిటీస్‌కు సంబంధించి తక్కువ సమయంలో విజువల్స్‌తో సహా వివరించారు.

ఈ నెల 5న సర్టిఫికెట్స్ ప్రధానం..

ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 5న సర్టిఫికెట్లు అందించనున్నట్లు చాంపియన్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఫౌండర్ డాక్టర్ తుర్లపాటి పట్టాభిరాం తెలిపారు.

10 నుంచి అంకమ్మ జాతర

తల్లాడ: ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో అంకమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీనివాసరావు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే జాతరలో అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మల అమ్మవార్లకు వివిధ రూపాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమం జరుగుతుందని వివరించారు. అనంతరం 12నుంచి మూడు రోజులు మహా అన్నదానం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అంకమ్మ దేవాలయ కమిటీ సభ్యులు దేవేందర్, వెంకటేశ్వరరావు, నరసింహారావు, సత్యం, శ్రీనివాసరావు, సాంబశివరావు(?) దీపులు, నరసింహారావు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి సంస్మరణ సభ

కొణిజర్ల: మండలంలోని సిద్దిక్‌నగర్‌లో యరమల మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కృష్ణారెడ్డి సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ.. సొసైటీ వైస్ చైర్మన్ రైతుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. నాయకులు కృష్ణయ్య, రాంబాబు, వీరభద్రం, కృష్ణ, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతసాగర్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న లక్ష్మీకాంతమ్మ

చింతకాని: మండలంలోని అనంతసాగర్‌కు చెందిన పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఏపీలోని విశాఖపట్నంలో ఆమెకు డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ బాధ్యులు డాక్టరేట్ అందజేశారు. మాస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలకు ఈ గౌరవం దక్కిందని ఆమె తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి

కల్లూరురూరల్: రేషన్‌షాపుల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని, అదే విధంగా రేషన్ బియ్యం తీసుకున్న వినియోగదారునికి రసీదు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ కల్లూరు మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ పులి సాంబశివుడికు వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం గరీబ్‌కళ్యాణ్ అన్న యోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వ్యక్తికి ఇస్తున్న 6 కేజీల బియ్యంలో ఐదు కిలోలు కేంద్ర పభుత్వం ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక కిలో బియ్యం మాత్రమే ఇస్తోందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షులు గుమ్మా రామకృష్ణ, నాయకులు అప్పారావు, భీమరాజు, వినయ్, రమేష్, పుల్లారావు, అనీల్‌కుమార్, గోవర్ధన్, రామకృష్ణ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో చేర్పించాలి



టేకులపల్లి మోడల్ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్ చారి

పెనుబల్లి: టేకులపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థినులు అధిక సంఖ్యలో చేరేలా ఉపాధ్యాయులు పనిచేయాలని అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలతో గురువారం మండలంలోని టేకులపల్లి మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఈ పాఠశాలలో 800మంది విద్యార్థినులు ఉన్నారని, ఈ ఏడాది అంతకంటే ఎక్కువ మంది విద్యార్థినిలు చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు.

టీషర్టుల పంపిణీ

కారేపల్లి: మండల పరిధిలోని మోకాళ్లగుంపు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎన్ఆర్ఐ బానోత్ వంశీకృష్ణ –దివ్య దంపతుల కుమార్తె మౌక్తిక నైరా పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు టీషర్టులను వితరణ చేయగా, గురువారం మాజీ సర్పంచ్ ధరావత్ భద్రునాయక్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుగులోతు తేజ్యానాయక్, దారావత్ మునిరాం, పాఠశాల హెచ్‌ఎం వీరూ నాయక్, కామల్ల సుందరయ్య, అజ్మీర దస్రు నాయక్, అంగోతు రమేష్, మోహన్, అజయ్, నాగమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను సంరక్షించుకోవాలి

మధిర నియోజకవర్గంలో..



బోనకల్: స్వీట్ బాక్స్ అందిస్తున్న అధికారులు



సత్తుపల్లి: జవహర్‌నగర్‌లో ఆడపిల్ల తల్లికి పండ్లు, స్వీట్లు అందిస్తున్న అధికారులు



ఏన్కూరు: తల్లిదండ్రులను సన్మానిస్తున్న దృశ్యం

చింతకాని/బోనకల్/ఎర్రుపాలెం: ఆడపిల్లలను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పేర్కొన్నారు. «మా పాప – మా ఇంటి మణిదీపం» కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గాంధీనగర్‌కాలనీ గ్రామంలో జన్మించిన బాలిక తల్లిదండ్రులు తాళ్లూరు సురేష్, బిందు లను గురువారం డీపీఓ సన్మానించారు. బోనకల్‌లోని మోటమర్రి గ్రామంలో బలవంతపు కావ్య, సురేష్ దంపతులను ఎంపీడీఓ రామాదేవి సత్కరించి స్వీట్ బాక్స్ అందించారు. ఎర్రుపాలెం మండలంలోని మామునూరులో గంతాల కృష్ణ – వెంకట్రావమ్మ దంపతులకు ఇటీవల పాప జన్మించగా.. వారిని గురువారం ఎంపీడీఓ సురేంద్రనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తోట సరిత, సునీత, మధులత సన్మానించి స్వీట్లు అందించి ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీఓ శివకుమారి, మండల పంచాయతీ అధికారి పర్వీన్ ఖైసర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, శివమ్మ, ఏఎన్ఎం సంధ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవి ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, సుజాత, తహసీల్దార్ చందర్, వైద్యాధికారిణి స్రవంతి, హెచ్ఈఓ దానయ్య, పంచాయతీ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, బాలికలే ఇంటి మణిదీపాలు తదితరులు పాల్గొన్నారు.

వైరా నియోజకవర్గంలో..

కారేపల్లి/వైరారూరల్/ఏన్కూరు/కొణిజర్ల: కారేపల్లిలోని గుంపెళ్లగూడెం గ్రామంలో ఇటీవల ఆడపిల్ల జన్మించిన మూతి రామకృష్ణ – స్వప్న దంపతులకు మండల స్పెషలాఫీసర్ నవీన్‌బాబు, ఎంపీడీఓ సురేందర్‌లు గురువారం శాలువతో సత్కరించి, సర్టిఫికేట్ అందజేసి అభినందించారు. వైరారూరల్ మండలోని కేజీ సిరిపురం అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలను తహసీల్దార్ కేవీ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సరస్వతీ సత్కరించి సర్టిఫికెట్లు అందించారు. ఏన్కూరులోని తూతకలింగన్నపేటలో గద్దం యశ్వంత్ – తన్మయి దంపతులను, కుటుంబ సభ్యులను మండల ప్రత్యేకాధికారి సాయినాథ్ ఘనంగా సన్మానించారు. కొణిజర్లకు చెందిన కుంచపు రమాదేవి – రాజా దంపతులతో పాటు, రమాదేవి తండ్రిని ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఉషారాణి, ఎంపీడీఓ రోజారాణి ఘనంగా సత్కరించి స్వీట్ బాక్స్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవేంద్ర, గ్రామ కార్యదర్శి వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్. బీజాన్‌బీ, ఎంపీడీఓ రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, సూపర్‌వైజ్యోతి, పంచాయతీ కార్యదర్శి రజియా తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..

సత్తుపల్లి/తల్లాడ/కల్లూరురూరల్/పెనుబల్లి: సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్‌లో ఆడపిల్ల పుట్టిన ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, నానమ్మకు శాలువాలు కప్పి స్వీట్లు, పండ్లు, సర్టిఫికెట్లు మండల స్పెషలాఫీసర్ సునీల్‌రెడ్డి, సీడీపీఓ కనకదుర్గ అందిశారు. తల్లాడలోని ఆడపిల్ల తల్లిదండ్రులను తహసీల్దార్ సురేష్‌కుమార్, కల్లూరులోని చంద్రుపట్లలో దుగ్గిరాల శిరీష ప్రవీన్ దంపతులను ఐసీడీఎస్ కల్లూరు ప్రాజెక్ట్ రత్న, పెనుబల్లిలోని మండాలపాడులో గాయం శ్రావణి బాలింతకు ఎంపీడీఓ అన్నపూర్ణ సత్కరించి, సర్టిఫికెట్లుఅందించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహాలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ షరా, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏసీడీపీఓ నవ్యశ్రీ, ఈఓ కృష్ణారావు, సూపర్‌వైజర్ సత్యావతి, రోజా, రత్నకుమారి, భద్రమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, సంధ్యారాణి, భవాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, సంధ్యారాణి, భవాని తదితరులు పాల్గొన్నారు.